సాక్షి తిరుపతి

శనివారం । 30 । ఆగస్టు । 2025



ఏనుగుల బీభత్సం

చంద్రగిరి మండలం చిన్న రామాపురంలోని పంట పొలాలపై ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించి, నష్టం కలిగించాయి. - 8లో



తెలుగు ఔన్నత్యానికి గిడుగు కృషి

తెలుగు భాష ఔన్నత్యానికి గిడుగు వెంకట రామమూర్తి ఎనలేని కృషి చేశారని జేసీ శుభం బన్సల్ కొనియాడారు. - 8లో



చెవిరెడ్డికి బెయిల్ రావాలని..

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి బెయిల్ రావాలని, ఆరోగ్యం బాగుండాలని అరుణాచలానికి బస్సు యాత్ర చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.82 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,82,17,085 వచ్చింది. ఆలయ ఆవరణలోని కొల్లు మండపంలో శుక్రవారం హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 58 గ్రాములు, వెండి 510.600 కిలోలు, విదేశీ కరెన్సీ 265 వచ్చాయి. గత నెల 30వ తేదీ నుంచి ఈ హుండీ ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, హేమమాలిని, పర్యవేక్షకులు రవి, శ్రీహరి, నాగభూషణం, విజయసారథి, లావణ్య పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి పోటీలకు నెల్లటూరు విద్యార్థి




వెంకట కార్తీక్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

గూడూరు రూరల్ : రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలకు నెల్లటూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎం.వెంకట కార్తీక్ ఎంపికయ్యాడు. నేటి నుంచి ప్రకాశం జిల్లా చేవూరు గ్రామంలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం పార్వతమ్మ వెంకట కార్తీక్‌ను అభినందించారు.

పంచాయతీరాజ్ జిల్లా అధికారి బదిలీ

తిరుపతి అర్బన్ : పంచాయతీ రాజ్ జిల్లా అధికారి (ఇంజినీర్)రామ్మోహన్ విజయవాడ ప్రధాన కార్యాలయానికి శుక్రవారం బదిలీ అయ్యారు. ఆయన ఏడాది కిందట కడప జిల్లా నుంచి తిరుపతికి విచ్చేశారు. అయితే పదోన్నతిలో భాగంగా విజయవాడకు బదిలీ అయ్యారు. అలాగే పీలేరులో పనిచేస్తున్న మధుసూదన్ తిరుపతి జిల్లా పంచాయతీ రాజ్ అధికారిగా నియమించారు. ఆ మేరకు ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.



గత ఏడాది కుప్పంలో కృష్ణా జలాలకు పూజలు నిర్వహిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

నాడు శాశ్వతం

- జల సంకల్పానికి ఊపిరులూది.. కుప్పం దాకా కృష్ణమ్మను పరుగులు పెట్టించిందెవరు?
- బీడువారిన పొలాలను సస్యశ్యామలం చేయాలని కంకణం కట్టుకున్నదెవరు?
- కరోనా రక్కసిని లెక్కచేయకుండా అందరికన్నా ముందుగా కుప్పం దాకా కృష్ణమ్మను తీసుకొచ్చిందెవరు?
- పిచ్చిమొక్కలతో నిండిన హంద్రీ–నీవా కాలువలో నీటి గలగలలు పెట్టించిందెవరు?
- నెర్రెలు బారి.. నోళ్లు తెరుచుకున్న చెరువులను నీటితో నింపిందెవరు?
- వానదేవుడిపై భారమేసి ఆకాశం వైపు ఆశగా ఎదురుచూసే అన్నదాతకు నేనున్నానని భరోసానిచ్చిందెవరు?
- కుప్పానికి నీరివ్వాలన్న దృఢ సంకల్పంతో అడుగులేసింది జగనన్న కాదా?.
- బక్కచిక్కిన రైతుకు అండగా నిలిచింది వైఎస్సార్‌సీపీ కాదా?

నేడు నాసిరకం

- సొంత కంపెనీలకు దోచిపెట్టి.. నాసిరకం పనులు చేసిందెవరు?
- లీకేజీలు, సీఫేజీలు పట్టించుకోకుండా గాలికొదిలేసిందెవరు?
- కొండలు..గుట్టల్లో సాగే హంద్రీ–నీవా కాలువ పనుల్లో నాణ్యత గురించి పరిశీలించిందెవరు?
- గతాన్ని మరిచి తన సొంత నియోజకవర్గానికి నీళ్లు తెచ్చామంటూ బడాయి మాటలు మాట్లాడేదెవరు?
- కృష్ణమ్మ నీటిపై అబద్ధపు శాసనం రాసి హంద్రీ–నీవాలో వదిలేస్తే దాన్ని శాశ్వత చిరునామాగా స్వీకరించేదెవరు?
- ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలు అమాయకులనుకుంటున్నారా?
- గారడీ మాటలకు ఇంకా బోల్తాపడతారని నమ్ముతున్నారా?
- ఇంకెంత కాలం బాబూ.. ఈ నీటి మాటలు?



కొండలు, గుట్టల్లో తూతూమంత్రంగా జరిగిన లైనింగ్ పనులు

నిజం నీళ్లకేం తెలుసు?



బైరెడ్డిపల్లి మండలం తీర్థం వద్ద నదిలోని రాళ్లపై నుంచి ఊడిన సిమెంట్ పెచ్చులు

నాసిరకంగా హంద్రీ–నీవా కాలువ పనులు

- రాళ్లున్న చోట సిమెంట్ పాలీష్
- రాళ్లపై నుంచి ఊడిపోతున్న సిమెంట్
- అండర్ పైప్‌లైన్ మార్గాల్లో తప్పని వాటర్ లీకేజీ
- చెరువులకు మళ్లించే చోట దెబ్బతిన్న సిమెంట్ పనులు


పలమనేరు: కూటమి అబద్ధపు హామీలు.. గారడీ మాటలకు హంద్రీ–నీవా బలైపోతోంది. నాణ్యత లేని పనులు.. నాసిరక నిర్మాణాలతో తనలో ప్రవహించే కృష్ణమ్మను కాపాడలేక అల్లాడిపోతోంది. ఎక్కడ చూసినా లీకేజీలు.. ఏ పక్క చూసినా సీఫేజీలే కనిపిస్తుండడం సర్వసాధారణమైపోయింది. తమ సొంత కంపెనీలకు దోచిపెట్టి.. కుప్పానికి నీళ్లు తెప్పిస్తున్నామంటూ సంకలెగరేయడం విమర్శలకు తావిస్తోంది.

గత ప్రభుత్వంలో లైనింగ్ లేకనే!

కుప్పానికి కృష్ణమ్మను అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృతనిశ్చయంతో అడుగులేసింది. గంగవరం మండలంలోని పశపత్తూరు, వీకోట మండలంలోని కృష్ణాపురం, రామకుప్పం మండలంలోని ఆదినేపల్లి వద్ద పంప్‌హౌస్‌లు నిర్మించింది. పశపత్తూరు వద్ద 750 కిలో వాట్స్ సామర్థ్యం గల నాలుగు మోటార్ల ద్వారా గంటకు 5,400 క్యూసెక్‌ల నీటిని పంపే 5 వేల కేవీ మోటార్లను ఏర్పాటు చేసింది. దీంతో పాటు నీరు వేగంగా వెళ్లేలా భారీ కంప్రెషర్లు సమకూర్చింది. అప్పట్లోనే పెండింగ్ కాలువ నిర్మాణాలు, స్ట్రక్చర్ నిర్మాణాలు, 8 వేల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు, 40 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు, మూడు చోట్ల లిఫ్ట్ పనులను పూర్తిచేసింది. కృష్ణా జలాలు కుప్పానికి చేరేలా చర్యలు చేపట్టింది.

రాళ్లున్న చోట నాసిరకం పనులు

కుప్పం ఉప కాలువకు సంబంధించి పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లె నుంచి 143.9 కి.మీ పొడవుతో కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువు దాకా పీబీసీ లైనింగ్ జరిగింది. ఇందులో బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం నుంచి రామనపల్లి కాలువ మార్గంలో రాళ్లున్న చోట సిమెంట్‌ను చల్లి వదిలేశారు. ఆ రాళ్లపై నుంచి సిమెంట్ కిందికి రాలుతోంది. ఇదే మార్గంలో కొన్నిచోట్ల ఓవర్ బ్రిడ్జీలపై నిర్మించిన పైప్‌లైన్లలో నీటి లీకేజీలు కనిపిస్తున్నాయి. తాతిరెడ్డిపల్లి వద్ద ఇంకా లైనింగ్ పనులు సాగుతున్నాయి. కాలువ మార్గంలో చెరువుకు నీరు మళ్లించే చోట్ల బయట వైపు నిర్మించిన సిమెంట్ పనులు దెబ్బతిన్నాయి. వీ.కోట మండలంలోని పోతనపల్లి వద్ద అటవీ మార్గంలో భూమిలోపల అమర్చిన పైప్‌లైన్లపై గాలి వెళ్లేందుకు వాల్వులు ఏర్పాటు చేశారు. ఇక్కడి అటవీ ప్రాంతంలో నీరు లీకవుతోంది. కాలువ లైనింగ్ పనులు అటవీ మార్గంలో ఎలా సాగుతాయో నేరుగా చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది.



పోతనపల్లి అడవిలోని కాలువలో అండర్‌పైప్ నుంచి లీకవుతున్న నీరు



తాతిరెడ్డిపల్లి వద్ద దెబ్బతిన్న సిమెంట్ పనులు

గొప్పలు.. కూటమికి తిప్పలు?

కూటమి ప్రభుత్వం గత టీడీపీ హయాంలో పనులు చేపట్టిన సీఎం రమేష్‌కు చెందిన కంపెనీకి అంచనాలను పెంచి లైనింగ్ పనులను కేటాయించింది. ఆ మేరకు కుప్పం బ్రాంచి కెనాల్ లైనింగ్ పనులు రూ.161.78 కోట్లు, పుంగనూరు ఉపకాలువ లైనింగ్ కోసం రూ.480 కోట్లను కేటాయించింది. ఈ పనులు దక్కించుకున్న సంస్థ నాసిరకంగానే పనులు చేపట్టింది. కనీసం క్వాలిటీ కంట్రోల్ శాఖ కూడా పట్టించుకోలేదు. దీంతో లైనింగ్ పనులు ఎన్నాళ్లుంటాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.



ఖాజీపేట వద్ద ఇప్పటికీ సాగుతున్న పనులు

పేకాట కూటమి

తిరుపతి జిల్లాలో పేకాట శిబిరాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కొంత మంది కూటమి నేతలే నిర్వాహకులుగా మారి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. కొన్ని లాడ్జీలు, హోటళ్లు , శివారు ప్రాంతాలు ఒకటేమిటి..ఎక్కడపడితే అక్కడ పేకాట శిబిరాలు నిర్వహిస్తూ దందా సాగిస్తున్నారు. వీటిపై చర్యలు తీసుకోవడానికి కూడా పోలీసులు వెనుకంజ వేస్తున్నారు. నిర్వాహకులు కూటమి నేతలు కావడంతో పోలీసులు నిస్సహాయులుగా మారిపోయారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇలాంటి వాటిపై కఠినంగా వ్యవహరించడంతో గత అయిదేళ్లు ఈ వ్యవహారం సద్దుమణిగింది. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ పేకాట రాయుళ్లు రెచ్చిపోతున్నారు. దీంతో పేదల జీవితాలు రోడ్డున పడుతున్నాయి.

- జిల్లాలో జోరుగా పేకాట శిబిరాలు
- రోజుకు రూ.2 నుంచి 3 కోట్ల లావాదేవీలు
- టీడీపీ నేతలకు 20 శాతం, అధికారులకు 10 శాతం మామూళ్లు!
- రోడ్డున పడుతున్న పేదలు, దిగువ తరగతి కుటుంబాలు
- లొకేషన్లు షేర్ చేస్తూ ఆడిస్తున్న వైనం
- ప్రతి రోజు చేతులు మారుతున్న కోట్ల రూపాయలు



చంద్రగిరి మండలంలో పేకాటాడుతున్న చిత్రం(ఫైల్)



ఏర్పేడు శివారులో పేకాటాడుతున్న వారి డ్రోన్ చిత్రం(ఫైల్)

టాస్క్‌ఫోర్స్ : కాలక్షేపం కోసం కొందరు.. కాసుల కోసం మరికొందరు.. అలవాటు మానుకోలేక ఇంకొందరు ఇలా జూదానికి అలవాటు పడుతున్నారు. గత ప్రభుత్వం పేకాటపై నిఘా పెట్టడంతో జూదగాళ్లందరూ అలవాటు మానుకొని కుటుంబాలతో సంతోషంగా గడిపేవారు. ఎప్పుడైతే పచ్చదండు చేతికి పగ్గాలు వచ్చాయో.. పేదవాడి చేతికి పేకముక్కలు చేరిపోయాయి. దీంతో తిరుపతి జిల్లాలో విచ్చలవిడిగా పేకాట మొదలైంది. హోటల్లు, లాడ్జీలు, నగర శివారు ప్రాంతాలలో విచ్చలవిడిగా పేకాట రాయుళ్లు రెచ్చిపోతున్నారు. వీళ్లను ఆసరాగా తీసుకుని నిర్వాహకులు రూ. కోట్లు సంపాదిస్తున్నారు. దీంతో పేదల బతుకులు బుగ్గిపాలవుతున్నాయి.

కూటమి బడా నేతలకు ముడుపులు

శ్రీకాళహస్తిలో ఓ ప్రధాన నాయకుడు రోజుకు ఒక పల్లెలో పేకాట శిబిరాన్ని ఆడిస్తున్నట్లు సమాచారం. చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారికి ఫోన్ల ద్వారా తెలిపి వారు చెప్పిన లోకేషన్లో ఆట జరుగుతున్నట్లు సమాచారం ఇస్తున్నారు. ఈ విధంగా ప్రతిరోజు రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయి. ఇలా ఆటను అనుమతిస్తూ ఆటంకాలు రాకుండా చూసుకున్న బడా నాయకులకు కూడా నెలవారి మామూళ్లను లక్షల్లో ముడుపులుగా చెల్లించినట్లు తెలుస్తోంది. పోలీసులు కూడా అడపాదడపా దీనిపై కేసులు నమోదు చేస్తున్నా.. నిర్వాహకులు మారడంలేదు.

చేతులు మారుతున్న రూ.కోట్ల వ్యాపారం

పేకాట శిబిరాలతో జిల్లాలో ప్రతిరోజు సుమారు రెండు నుంచి మూడు కోట్లు చేతులు మారుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో సుమారు 20 శాతానికి పైగా ఆదాయం టీడీపీ నాయకుల జేబుల్లోకి వెళుతుండగా మరో 10 శాతం ఆదాయం అధికారుల జేబులను కూడా తడుపుతున్నట్లుగా తెలుస్తోంది. అధికార పార్టీ నేతలే నిర్వాహకులు కావడంతో ఆటాడే ప్రాంతం పోలీసులకు తెలిసినా కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పేకాట ఆడిస్తూ కొందరు లాభాలు గడిస్తుంటే మరికొందరు భార్య మెడలో ఉన్న పుస్తెలు కూడా అమ్ముకుని రోడ్డున పడుతున్నారు.



ఉదయం వెళ్లి సాయంత్ర వరకూ అక్కడే మకాం

జూదానికి అలవాటుపడిన వారు ఉద్యోగానికి వెళ్లే వారి లాగానే ఉదయం వెళ్లి సాయంత్రం వరకు, కొన్ని సందర్భాల్లో రాత్రుల్లోనూ అక్కడే గడుపుతున్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు ఆడేవారంతా ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు హోటళ్లు, లాడ్జీల్లో గదులను అద్దెకు తీసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో కొన్ని లాడ్జీల్లో పేకాడుతూ పలువురు పట్టుబడ్డారు. వాస్తవానికి లాడ్జీల్లో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం నేరం. కానీ,

భయపడటం లేదు..

పేకాట ఆడుతూ పట్టుబడుతున్న సంఘటనలు జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్నాయి. అయినప్పటికీ ఈ జూదానికి అలవాటుపడ్డ వారు ఏమాత్రం భయపడటం లేదు. ఒకవేళ పోలీసులకు పట్టుబడినా పెద్దగా శిక్షలు లేకపోవడంతో, న్యాయస్థానంలో జరిమానా కట్టి బయటకు రావచ్చన్న ధీమానే వీరిని మళ్లీ మళ్లీ పేకాట వైపు మళ్లిస్తోందనే విమర్శలున్నాయి.

పుట్టగొడుగుల్లా పేకాట కేంద్రాలు

తిరుపతి జిల్లా పరిధిలో కొద్ది రోజులుగా పేకాట కేంద్రాలు టీడీపీ కనుసన్నల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. తిరుపతి, శ్రీకాళహస్తి పుత్తూరు, రేణిగుంట, వెంకటగిరి, సూళ్లూరుపేట ప్రాంతాలలో జూదాల నిలయాలు వెలుస్తున్నాయి. స్థానిక టీడీపీ నాయకులే నిర్వాహకులుగా మారి రోజుకు రూ. లక్షల్లో కొల్లగొడుతున్నారు. ఆటను బట్టి రేట్లు కుదిరించుకుంటున్నారు. రోజుకు ఒక స్థావరం, ఒక ప్రాంతం అంటూ ఎంచుకుంటూ ప్రతిరోజు ఎక్కడో ఒక చోట పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారు.

గిరాకీలు లేవనో, గదులు ఖాళీగా ఉన్నాయన్న కారణంతోనో తెలిసినవారున్నారనో.. మొత్తానికి కొంత మంది జూదరులకు సహకరిస్తున్నారు. కొన్ని సంఘ భవనాలు సైతం దీనికి మినహాయింపు కాదు. ఖాళీ సమయాల్లో సమావేశాలు, పిచ్చాపాటిగా మాట్లాడుకునేందుకు వేదికగా పేర్కొంటూనే అంతర్లీనంగా ఇక్కడ పేకాటను కొనసాగిస్తున్నారు. వచ్చినవారంతా ఆర్థికంగా ఉన్నవారు కావడంతో ఇక్కడ పెద్ద మొత్తంలో డబ్బులు జూదంలో పెట్టేస్తున్నారు. బయటి వ్యక్తులు ఏమాత్రం అనుమానించే అవకాశం లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి తమకు తెలిసిన వారిని సైతం ఆహ్వానించి పేకాటను కొనసాగిస్తున్నారు.

శివారు ప్రాంతాల్లోనూ వదలట్లే..

కేవలం అద్దె గదుల్లోనే కాదు.. శివారు ప్రాంతాలనూ లక్ష్యంగా చేసుకొని కొంత మంది జూదాన్ని యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. దూరంగా ఉండే ప్రాంతంలో చెట్ల కింద, తోటలు, పంట పొలాలను వేదికగా మార్చుకుంటున్నారు. ఆడేవారికి మినహా ఇతరులకు ఏమాత్రం సమాచారం లేకుండా ఔత్సాహిక సభ్యులు బృందంగా ఏర్పడి తాము నిర్ణయించుకున్న స్థలానికి చేరుకుంటున్నారు. మద్యం తాగడం, భోజనం చేయడం అక్కడే కానిస్తున్నారు. సమయానికి డబ్బులు లేకపోతే అప్పులు చేసో, ఇంట్లో ఉన్న వస్తువులు తాకట్టు పెట్టో ఆట కోసం వెళ్తున్నట్లు తెలుస్తోంది.

శిబిరాల్లో అన్ని సౌకర్యాలు

పేకాట ఆడే అందుకు వచ్చిన వారికి సకల సౌకర్యాలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. వారికి భోజనం, మద్యం, మాంసం, సిగరెట్లు, సకాలంలో అందిస్తూ.. వీరికి సర్వింగ్ చేయడానికి కొంత మందిని ఏర్పాటు చేస్తున్నారు. ఆటగాళ్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాలుగా సౌకర్యాలు సమకూరుస్తున్నారు.

స్టేషన్‌కు కూతవేటు దూరంలో..

తిరుపతి నగరం నడిబొడ్డున ఉన్న స్టేషన్‌కు కూతవేటు దూరంలో టీడీపీ బడా నేత లాడ్జీలో రోజుకు లక్ష నుంచి 2 లక్షల వరకు తీసుకుంటూ పేకాటను ఆడిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరంతా కూడా లాడ్జీ ఓనర్లకు, పెద్ద స్టార్ హోటళ్లకు పెద్ద మొత్తంలో నగదును ఆశపెట్టి రూములు తీసుకొని ఆటలు నిర్వహిస్తున్నారు. పోలీసులు వస్తే కూడా మేము చూసుకుంటామంటూ భరోసా కల్పిస్తున్నారు. అంతే కాకుండా రోజుకో ప్రాంతంలో చోటు మారడంతో ఎవరికీ కూడా అనుమానం రాకుండా ఆటలు జరుగుతున్నాయి. అంతే కాకుండా నగరంలో మరోచోట టీటీడీలో ఉన్నత స్థాయి పోస్టులో రిటైర్డ్ అయిన మాజీ ఉద్యోగి కూడా పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేకాట రాయుళ్లు చెబుతున్నారు.

బుగ్గిపాలవుతున్న జీవితాలు

పేకాటకు అలవాటు పడిన వ్యక్తులకు గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. ఆన్లైన్లోనూ ఫిజికల్‌గాను అడ్డుకట్ట వేసింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కూటమి నేతలు పేదవారి జీవితాలతో పేకాట ఆడుతున్నారు. అక్కడా.. ఇక్కడ అని తేడా లేకుండా.. జిల్లా అంతటా విచ్చలవిడిగా పేకాట సాగుతోంది. దీనికి నిదర్శనం ఇటీవల సాక్షాత్తు టీడీపీ ఎమ్మెల్యేనే.. సీఎంతో మాట్లాడుతాం.. పేకాట క్లబ్బులు జరిపిస్తాం.. జనాల మైండ్ సెట్ ను పోగొడతామంటూ... కారు కూతలు కూసింది.. తెలిసిందే. ఈ మాటలు ఎప్పుడైతే ప్రారంభమయ్యాయో పేకాట రాయుళ్ల నిర్వాహకులకు కూడా కొండంత ధైర్యం.. కొండంత అండ.. బలం చేకూరింది. చిన్నా, పెద్ద తేడా లేకుండా పేకాట ఆడిస్తూ పేదల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారు.

తెలుగు తల్లి విగ్రహం వద్ద టీచర్ల నిరసన

- తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

తిరుపతి సిటీ : తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని, తెలుగు భాషకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీఏ) నాయకులు తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం నిరసన తెలిపారు. ఈ మేరకు తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తెలుగు తల్లి విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు దొడ్డ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. భాషోపాధ్యాయులను క్లస్టర్, పీఎస్, హెచ్‌ఎం పోస్టుల నుంచి తప్పించి భాషోపాధ్యాయ విధుల్లో నియమించాలని డిమాండ్ చేశారు. భాషా పండితులకు హైకోర్టు తీర్పును అమలు చేస్తూ పదోన్నతులు కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు శాంతియుత నిరసన తెలియజేస్తూనే ఉంటామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటయ్య, రాష్ట్ర కార్యదర్శి పట్టాభిరామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ జిల్లా గౌరవ సలహాదారు ఈశ్వరయ్య, నేతలు వాసుదేవయ్య, గురుస్వామి, రాఘవేంద్ర, భాషోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మదనంబేడులో క్షుద్ర పూజల కలకలం


క్షుద్ర పూజల కోసం రోడ్డుపై వేసిన ముగ్గు

సత్యవేడు : మండల పరిధిలోని మదనంబేడులోని వేంకటేశ్వర స్వామి ఆలయం వీధిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించడంతో గ్రామంలో కలకలం రేపింది. ఆలయం సమీపంలోని నడివీధి మధ్యలో ఓ ఇంటి ముందు రోడ్డుపై ముగ్గు వేసి పేడ ముద్దలు, నిమ్మకాయలు ఉంచి క్షుద్ర పూజలు నిర్వహించారు. వీధిలోని వారితో పాటు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు స్పందించి క్షుద్ర పూజలు నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏనుగుల బీభత్సం


ఏనుగుల దాడిలో ధ్వంసమైన అరటి చెట్లు

చంద్రగిరి : ఏనుగుల దాడిలో పంటలు ధ్వంసమైన ఘటన గురువారం అర్ధరాత్రి మండల పరిధిలోని చిన్నరామాపురంలో చోటు చేసుకుంది. అర్ధరాత్రి సమయంలో ఏనుగుల గుంపు గ్రామ సమీపంలోని పంట పొలాలపై దాడికి పాల్పడ్డాయి. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రైతు బొమ్మల మునిరత్నం, భారతికి చెందిన పొలాల్లో బీభత్సం సృష్టించాయి. అరటి, కొబ్బరి చెట్లు, పశువుల గడ్డి వామును నేలమట్టం చేశాయి. అక్కడ నుంచి సమీపంలోని పంటలను తొక్కుకుంటూ నాశనం చేసినట్లు రైతులు వాపోయారు. పొలాలకు వేసిన కంచెను సైతం ధ్వంసం చేసుకుంటూ చెరువు మార్గంలో వెళ్లాయని, అక్కడి నుంచి అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారంతో పాటు ఏనుగులు పొలాలపై రాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

తిరుపతి అర్బన్ : జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆ మేరకు సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు పొడిగింపు ఉంటుందని స్పష్టం చేశారు. కొత్త కార్డుల జారీ ప్రక్రియకు సంబంధించి సమాచారం వస్తే తెలియజేస్తామన్నారు. జర్నలిస్టులు మరో మూడు నెలలు రెన్యూవల్ చేసుకోవాలని కోరారు.

వక్రతుండ.. మహాకాయ


ఉదయం వాహన సేవలో విహరిస్తున్న ఉత్సవర్లు

- మయూర వాహనంపై విహరించిన వినాయకుడు
- అశేష భక్తజనం నడుమ సాగిన ఊరేగింపు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నిత్య పూజలు, స్వామి నామస్మరణతో కాణిపాకం మార్మోగుతోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సిద్ధిబుద్ధి సమేత స్వామివారు స్వర్ణ మయూర వాహనంపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉదయం స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు గావించారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తదనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి బంగారు మయూర వాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు.


స్వర్ణ మయూర వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ఒత్తిడితో విలవిల!



- ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితి దయనీయం
- మార్కులు, ర్యాంకుల పేరుతో నరకం చూపిస్తున్న యాజమాన్యాలు
- తల్లిదండ్రుల ఆశలే ఆసరాగా విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- ఒత్తిళ్లతో మానసిక రోగులుగా మారుతున్న భావి భారతం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యావేత్తలు, వైద్య నిపుణులు



■ తిరుపతి నగరంలో పేరొందిన ఓ ప్రైవేటు పాఠశాలలో వెంకటగిరికి చెందిన ఓ విద్యార్థినిని తల్లిదండ్రులు ఈ ఏడాది జూన్‌లో 3వ తరగతిలో చేర్పించారు. ఆ పాఠశాలలోనే హాస్టల్‌లో చేర్పించి ఫీజులు లక్షల్లో చెల్లించుకున్నారు. ఆగస్టు 10వ తేదీన ఆ విద్యార్థి సరిగా స్పందించలేదని, ఆహారం సైతం సరిగా తీసుకోవడం లేదని తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం సమాచారం ఇచ్చింది. దీంతో హుటాహుటిన తల్లిదండ్రులు పాఠశాల వసతి గృహానికి చేరుకొని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి మానసికంగా ఒత్తిడికి గురైందని కనీసం మూడేళ్ల పాటు తగిన వైద్యం అందించాలని తెలియజేశారు.

■ ఓ ప్రముఖ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి తలనొప్పితో బాధ పడుతోందని చంద్రగిరి గ్రామీణ ప్రాంతానికి చెందిన తల్లిదండ్రుల తమ వద్దకు తీసుకొచ్చినట్లు నగరంలో ఓ ప్రైవేటు వైద్యశాల డాక్టర్ తెలియజేశారు. విద్యార్థిని పరీక్షించిన వైద్యులు ఒత్తిడితో మానసికంగా ఇబ్బంది పడుతోందని వైద్యులు తేల్చేశారు. దీంతో ఏకైక కుమారుడైన తమ బిడ్డకు ఇలాంటి పరిస్థితి రావడం దారుణమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉంచుకుని వైద్యం అందిస్తున్నారు.

తిరుపతి సిటీ : జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి దయనీయంగా తయారవుతోంది. ఎంతో మంది విద్యార్థులు యాజమాన్యాల ఒత్తిడిని తట్టుకోలేక మానసిక రోగులవుతున్న విషయాన్ని గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు సంస్థలు దాచడం సంచలనం సృష్టిస్తోంది. తల్లిదండ్రులు సైతం ఇందులో బాధ్యులు కావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రధానంగా 5 ఏళ్ల వయస్సు పిల్లల నుంచి 15 ఏళ్లలోపు వారు మానసిక రోగులుగా మారుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగులుగా ఉండటం, పిల్లలు సెల్‌ఫోన్‌కు అడిక్ట్ అవడంతో ఒకటో తరగతి పిల్లలను సైతం ప్రైవేటు పాఠశాలలో చేర్పించి అక్కడే హాస్టల్స్‌లో ఉంచడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది.

మాయమాటలు చెప్పి..

జిల్లాలో సుమారు 689 ప్రైవేటు కళాశాలలు ఉండగా అందులో సుమారు 356 ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. తల్లిదండ్రులకు ఆశలు రేపి మీ పిల్లలను స్టేట్ ర్యాంకర్లుగా తీర్చిదిద్దుతామని మాయమాటలు చెప్పి కోట్లలో వ్యాపారం చేసుకుంటూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఎంతో మంది ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు తల్లిదండ్రుల ఆప్యాయతకు దూరమవుతున్నారు. దీంతో శారీరక రుగ్మతలకు గురవడంతో పాటు మానసిక ఒత్తిడికి గురై మానసిక రోగులుగా మారుతూ తల్లిదండ్రులకు గుండె కోతను మిగులుస్తున్నారు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి



“ ప్రైవేటు యాజమాన్యాల ఊకదంపుడు ప్రచారాలకు ఆకర్షితులై ప్రైవేటు విద్యా సంస్థల్లో పిల్లలను చేర్పించడం దారుణం. దీంతో తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోక.. ప్రైవేటు యాజమాన్యాల టార్చర్ భరించలేక మానసిక రోగులవుతున్నారు. ఇది భావి భారతానికి ప్రమాదకరం. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ఆలోచించాలి.

– సుబ్బిరామిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు, తిరుపతి

మానసికంగా కుంగిపోతున్నారు..



పసికందుల జీవితాలతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ఆడుకుంటున్నాయి. ఇది చాలా ప్రమాదకరం, పాఠశాల యాజమాన్యాలు వ్యాపారంలో భాగంగా పిల్లల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి వారిని స్కూల్‌తో పాటు వారు నిర్వహిస్తున్న వసతిగృహాల్లో చేర్పించుకుని నరకం చూపిస్తున్నారు. దీంతో రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్న విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

– రవిశంకర్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థ విశ్రాంత అధ్యాపకులు, తిరుపతి

ఆటో స్పేర్‌పార్ట్స్ దుకాణంలో అగ్ని ప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో జీఎన్‌టీ రోడ్డు పక్కన వెంకటరమణ ఆటో స్పేర్ పార్ట్స్ దుకాణంలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించింది. బాధితురాలు మునికృష్ణమ్మ రైల్వేస్టేషన్ సమీపంలో ఆటో స్పేర్ పార్ట్స్ దుకాణం నడుపుతున్నారు. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో దుకాణంలో ఉన్న వారు భయంతో బయటకు వచ్చేశారు. దుకాణంలో ఉన్న వాటికి మంటలు వ్యాపించి తగలబడిపోయాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న రూ.7 లక్షలు వరకు సామగ్రికి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 63,843 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.49 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నారాయణ కళాశాల భవన నిర్మాణ పనుల్లో కార్మికుడి మృతి

రేణిగుంట : మండలంలోని విప్పమానుపట్టెడ గ్రామానికి సమీపంలోని తుడా లేఅవుట్‌లో నారాయణ విద్యా సంస్థలకు చెందిన నూతన భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు అన్సర్ హేహమన్ (19)నాలుగో అంతస్తు నుంచి జారి కిందపడి శుక్రవారం మృతి చెందినట్లు గాజుల మండ్యం పోలీసులు తెలిపారు. నారాయణ కాలేజ్ నాలుగో అంతస్తులో పనులు చేస్తున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు.

తిరుపతి చేరుకున్న మోటార్ సైకిల్ యాత్ర


మోటార్ సైకిల్ యాత్రకు స్వాగతం పలికిన డీఆర్వో

తిరుపతి అర్బన్ : నేపాల్ నుంచి శ్రీలంకకు వెళుతున్న త్రిసేనల బుద్ధ సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్ర శుక్రవారం రాత్రి తిరుపతి చేరుకుంది. తిరుపతి కలెక్టరేట్ నుంచి యాత్రకు స్వాగతం పలికినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ వద్ద వారికి డీఆర్వో ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ యాత్ర కన్వీన్ రాహుల్ పాటిల్‌కు తిరుపతి కలెక్టరేట్ వద్ద ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. ఈ యాత్ర భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన త్రిసేనల అధికారులు హాజరైనట్లు చెప్పారు. యాత్ర ద్వారా భగవాన్ బుద్ధుని శాశ్వత సందేశమైన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వాన్ని దేశం అంతటా వ్యాప్తి చేయడానికి చేస్తున్న ప్రయత్నం జరుగుతోందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారులు భరత్‌కుమార్‌రెడ్డి, జ్యోత్స్న, సాంస్కృతిక ప్రతినిధి మునికుమార్ పాల్గొన్నారు.

తెలుగు ఔన్నత్యానికి గిడుగు ఎనలేని కృషి

తిరుపతి అర్బన్ : తెలుగు భాష ఔన్నత్యానికి గిడుగు వెంకట రామమూర్తి ఎనలేని కృషి చేశారని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గిడుగు వెంకట రామమూర్తి జయంతిని జరుపుకున్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వాడుక భాషాయోధుడు, వ్యవహారిక భాషోద్యమానికి పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. గ్రాంధిక భాష వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు రామమూర్తి నాంది పలికారని తెలిపారు. డీఆర్‌ఓ నరసింహులు మాట్లాడుతూ.. గిడుగు జయంతి సందర్భంగా వారు తెలుగు భాషకు చేసిన సేవలకు గుర్తింపుగా ఈరోజు తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా తెలుగు పండితులను ఈరోజు సన్మానించడం జరుగుతుందని తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రోజ్‌మాండ్, శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం సమావేశం

తిరుపతి మంగళం : తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాళ్లతో సమావేశం నిర్వహించనున్నట్లు తిరుపతి నగర బూత్ కమిటీ ఇన్‌చార్జ్ ముప్పాల సాయికుమారి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ముఖ్యఅతిథులుగా చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరదు కళ్యాణి పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ మహిళా అనుబంధ విభాగాల మహిళలంతా తప్పక హాజరుకావాలని కోరారు.

- సర్పంచ్ గణపతిరెడ్డి ఆధ్వర్యంలో తరలిన గ్రామస్తులు
- అరుణాచలంలో చెవిరెడ్డి ఫొటో పట్టుకుని గిరి ప్రదక్షిణలు

చెవిరెడ్డికి బెయిల్ రావాలని..

అరుణాచలానికి బస్సు యాత్ర


నడవలూరు నుంచి అరుణాచలానికి బయలుదేరిన గ్రామస్తులు

తిరుపతి రూరల్ : కూటమి ప్రభుత్వం కుట్రలో భాగంగా చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అక్రమ కేసులో అరెస్టు చేసి 74 రోజులుగా జైలులో నిర్బంధించారు. చెవిరెడ్డిని అక్రమంగా జైలులో నిర్బంధించడాన్ని తప్పుపడుతూ ఆయనకు త్వరగా బెయిల్ మంజూరు కావాలని, వెన్నునొప్పితో బాధ పడుతున్న ఆయనకు ఆరోగ్యం బాగుండేలా చూడాలని నడవలూరు గ్రామ ప్రజలు అరుణాచలేశ్వరున్ని మొక్కుకున్నారు. చెవిరెడ్డి ఫొటోను చేతపట్టుకుని గిరి ప్రదక్షిణలు చేసి 108 కొబ్బరి కాయలు కొట్టారు.

మూడు బస్సుల్లో బయలుదేరి..

రామచంద్రాపురం మండలం నడవలూరు గ్రామానికి చెందిన ప్రజలు చెవిరెడ్డిని కాపాడాలని అరుణాచలం క్షేత్రానికి బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించుకున్నారు. గ్రామస్తులు కోరిక మేరకు సర్పంచ్ గణపతి రెడ్డి మూడు బస్సులను సిద్ధం చేయగా వంద మంది యాత్రలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 4 గంటలకు నడవలూరు నుంచి తిరువణ్ణామలైకి బస్సులో చేరుకుని ముందుగా అరుణాచలేశ్వరున్ని దర్శించారు. అనంతరం చెవిరెడ్డి ఫొటోను చేతపట్టుకుని గిరి ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణలో 14 కి.మీ నడవలేని మహిళలు, వృద్ధులు ఆటోలో ప్రదక్షిణ పూర్తి చేసుకున్నారు.

జైలు నుంచి బయటకు రావాలని..

అక్రమ నిర్బంధంలో ఉన్న చెవిరెడ్డి త్వరగా బయటకు రావడంతో పాటు ఆయన ఆరోగ్యం బాగుండాలని ప్రార్థిస్తూ నడవలూరు గ్రామస్తులు అరుణాచలం క్షేత్రంలోని ఈశాన్య లింగేశ్వరుడి వద్ద 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కుకున్నారు. స్వామీ అరుణాచలేశ్వరా చెవిరెడ్డిని కాపాడు.. అంటూ పెద్ద ఎత్తున నినదించారు.

గ్రామస్తుల కోరిక మేరకు తీసుకెళ్లా..



చెవిరెడ్డిని అక్రమంగా నిర్బంధించి 74 రోజులు గడుస్తోంది. ఇన్ని రోజులు ఆయనను ప్రజలకు దూరం చేయడం దుర్మార్గం. చెవిరెడ్డికి మంచి జరగాలని మా గ్రామ ప్రజలు అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేయాలని కోరారు. అందుకే వారికి అవసరమైన బస్సులతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించా. మా నాయకుడి కోసం ఎంత వరకైనా పోరాడుతాం.

– ఎస్.గణపతిరెడ్డి, సర్పంచ్, నడవలూరు

పింఛనుదారుడికి నమస్కారం పెట్టండి

తిరుపతి అర్బన్: సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేసే ముందు పింఛనుదారుడికి ఒక నమస్కారం చేయండి… తర్వాత చిరునవ్వుతో పింఛన అందించండి. అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆయన శుక్రవారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటికే వెళ్లి పింఛన్ ఇవ్వాలని లేదంటే కనీసం 300 మీటర్ల దూరం నుంచి ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఐఐటీలో ఎంటెక్ కోర్సు ప్రారంభం

ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ (ఇండస్ట్రీ స్పాన్సర్డ్)లో ఎంటెక్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కే ఎస్ సత్యనారాయణ, కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ ఔట్ రీచ్ డీన్ ప్రొఫెసర్ అరుణ్ కుమార్ తంగిరాల, కార్పొరేట్ రిలేషన్స్ డీన్ ప్రొఫెసర్ శశిధర్ గుమ్మ ప్రారంభించారు. వర్చువల్‌గా పాల్గొన్న జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అధినేత అశ్విన్ బజాజ్ మాట్లాడుతూ.. పారిశ్రామిక వృద్ధి పాత్ర, దేశ పునరుత్పాదక ఇంధన పరివర్తనలో అధునాతన ఇంధన నిల్వ అవసరాన్ని నొక్కి చెప్పారు. అమరరాజ బ్యాటరీస్ సీఈవో విజయానంద్ సాంకేతిక మార్పులపై వివరించారు. 13 మంది ఉద్యోగులు ఎంటెక్ ప్రోగ్రామ్‌లో చేరారు.

చెవిరెడ్డి కుటుంబీకులకు ఎంపీ పరామర్శ


చెవిరెడ్డి కుటుంబీకులను ఓదార్చుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి రూరల్ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమ కేసుల్లో ఇరికించి 74 రోజులుగా జైలులో నిర్బంధించడాన్ని తిరుపతి ఎంపీ గురుమూర్తి తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం కుట్రలకు భవిష్యత్తులో పోలీసులు బలికావాలసి వస్తుందన్న విషయం పోలీసు అధికారులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలోని చెవిరెడ్డి నివాసానికి చేరుకున్న ఆయన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, చిన్న కుమారుడు చెవిరెడి హర్షిత్‌రెడ్డిలను పరామర్శించి ధైర్యం చెప్పారు. చెవిరెడ్డికి ఆరోగ్యం సరిగాలేదని కోర్టుకు పదే, పదే చెబుతున్నా వైద్యం చేసుకునేందుకు కూడా అనుమతి ఇవ్వడం లేదని తెలుసుకున్న ఆయన ఆందోళన చెందవద్దని సూచించారు. ప్రజలకు ఎప్పుడూ మంచిచేసే చెవిరెడ్డికి కష్టాలు తప్పలేదని, త్వరలో ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.